క్లుప్తంగా

ఉత్సాహంగా చదరంగం పోటీలు

యానాం: నియోజకవర్గ పరిధిలో డాక్టర్ ఆరేటి యశోదానందకుమార్ స్మారకార్థం వివిధ పాఠశాలల విద్యార్థులకు స్థానిక రీజెన్సీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన చెస్ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రాథమిక స్థాయిలో బాలురు 44 మంది, మాధ్యమిక స్థాయిలో 58 మంది, హైస్కూల్, జూనియర్ కళాశాలల నుంచి 43 మంది మొత్తం 145 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు రిటైర్డ్ వ్యవసాయశాఖ జేడీ కామిశెట్టి వేణుగోపాలరావు తెలిపారు. అనంతరం విజేతలైన వారికి ప్రథమ, ద్వితీయ, కాన్సొలేషన్ బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం టీవీఎస్ఎస్‌పీ ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాగితాపల్లి మృతికి సంతాపం


కాగితాపల్లి నరసింహారావు (ఫైల్)

అమలాపురం టౌన్: మామిడికుదురు మండలం ఈదరాడకు చెందిన రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యాయుడు కాగితాపల్లి నరసింహారావు (45) ఆకస్మిక మృతికి అమలాపురానికి చెందిన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. నరసింహారావు హృద్రోగంతో ఆదివారం ఉదయం ఇంట్లో మృతి చెందడం రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘానికి తీరని లోటని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురానికి చెందిన నాయీ బ్రాహ్మణులు ఈదరాడకు వెళ్లి నరసింహారావు పార్థీవదేహంపై పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అమలాపురం పట్టణ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోళ్లపల్లి గోవింద్, కార్యదర్శి నేదునూరి తరుణ్, సంఘ నాయకులు పసుపులేటి రామకృష్ణ, పసుపులేటి మురళీ తదితరులు నరసింహారావు మృతి పట్ల సంతాపం తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ముమ్మిడివరం: వివాహిత అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.జ్వాలా సాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ముమ్మిడివరం మండలం గాడిలంకకు చెందిన వివాహిత (27) శనివారం ఉదయం గుడికి వెళుతున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద ఆమె ఆచూకీ కోసం గాలింపు చేపట్టినా ఫలితం లేకపోవడంతో భర్త మహేష్ ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ 9618955271, 9948471551, 9550329963 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

కొత్తపేట: భగవాన్ సత్యసాయిబాబా వారి స్ఫూర్తితో సమాజ సేవా కార్యక్రమాలు అభినందనీయమని సర్పంచ్ బూసి జయలక్ష్మి అన్నారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సేవాతత్పరులైన మహిళలను గుర్తించి వారిని సత్కరించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణ (కేఎస్ఎన్) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ డివిజనల్ అధికారి డాక్టర్ మెంటే సుమలత, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఏఎస్ఎస్ రమాదేవి, భగవద్గీత పఠనంతో గణపతి సచ్చిదానంద స్వామి నుంచి బంగారు పతకం పొందిన వాసవి ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు శ్రీకాకోళ్లపు భార్గవి, కంచర్ల రాధాకుమారిలను సర్పంచ్, సత్యసాయి మహిళా విభాగం సభ్యులు ఘనంగా సత్కరించారు.

సమస్యలపై నిరంతర పోరాటం

యానాం: నియోజకవర్గ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని ప్రముఖ వ్యాపారవేత్త తోట రాజు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో పేరుకుపోతున్న చెత్త సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోందని, శుభ్రపరిచిన రక్షిత మంచి నీరు అందించాలని డిమాండ్ చేశారు. పలుచోట్ల పలువీధుల్లో వీధిలైట్లు వెలగక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం విద్యుత్‌శాఖ సమస్యపై స్పందించాలని ఆయన కోరారు.

గాయపడిన బాధితుడి వైద్యానికి సాయం

రావులపాలెం: ప్రమాదవశాత్తూ పొయ్యి మీద నుంచి కూర మీద పడటంతో గాయపడిన బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12 వేలు ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్ (36) స్థానికంగా ఒక టిఫిన్ హోటల్‌లో వంట పని చేస్తారు. కొద్ది రోజులు క్రితం పొయ్యి మీద నుంచి కూర గిన్నె దింపుతుండగా జారి పడిపోవడంతో వేడి వేడి కూర మీద పడిపోయి చెయ్యి, కొంత శరీరం కాలిపోయాయి. పనికి వెళితే కానీ కుటుంబం గడవని పరిస్థితి, వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో ఇమ్రాన్ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12 వేల చెక్కు అందజేశారు.

బాణసంచా.. ధరల మోత


అమలాపురంలో బాలయోగి స్టేడియం బాణసంచా దుకాణాలు


నీలపల్లిలో బాణసంచా దుకాణదారులకు సూచనలిస్తున్న కోరంగి ఎస్సై సత్యనారాయణ, రెవెన్యూ శాఖ అధికారులు

- మార్కెట్‌లో దీపావళి పండగ సందడి
- అమలాపురం బాలయోగి స్టేడియంలో 38 దుకాణాల ఏర్పాటు
- పేరూరు, బండారులంక, కామనగరువుల్లో 16 దుకాణాలు

అమలాపురం రూరల్: మార్కెట్లకు దీపావళి పండగ కళ వచ్చింది. ఇంటింటా టపాసుల సందడి ప్రారంభమైంది. గతంలో స్వయంగా తయారు చేసిన టపాసులతో చిన్నారుల హడావుడి పది రోజుల ముందు నుంచి మొదలయ్యేది. కాలక్రమేణా ఆ సందడి పండగ రోజుకు పరిమితమైంది. దీపావళి ముందు రోజు, పండగ నాడు మాత్రమే ఏర్పాటయ్యే బాణసంచా దుకాణాల్లో టపాసుల కొనుగోలు చేస్తున్నారు. సోమవారం దీపావళి సందర్భంగా అమలాపురం పట్టణ, రూరల్ పరిధిలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు అనుమతించారు. ఆదివారం అమలాపురం జనుపల్లి పరిధిలో బాలయోగి స్టేడియంలో అధికారులు అనుమతి ఇచ్చిన 38 దుకాణాలు ఏర్పాటయ్యాయి. బండార్లంక 6, కామనగరువులో 7, పేరూరు 3 తదితర ప్రాంతాల్లో మొత్తం 54 పైగా దుకాణాలు వెలిశాయి. వినియోగదారుల సందడితో దుకాణాల వద్ద సందడి నెలకొంది. అమలాపురం తహసీల్దార్ వీఎస్ దివాకర్, తాలూకా ఎస్సై శేఖర్‌బాబు, అగ్నిమాపక అధికారి ఎం.రాజా దుకాణాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసులు అగ్నిమాపక సిబ్బంది పర్యవేక్షణలో అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు పాటించి బాణసంచా విక్రయించాలని తహసీల్దార్ కోరారు.

20 శాతం పెరిగిన ధరలు

గతేడాది కంటే అన్ని రకాల టపాసులపై దీపావళికి రూ.20 శాతం ధరలు పెరిగాయి. గతేడాది కాకర పువ్వొత్తుల 10 కట్టలు (పెద్దది) రూ.350 ఉంటే ఇప్పుడు అదే కట్ట ధర రూ.400 పెరిగింది. చిన్న కాకర పువ్వొత్తుల కట్ట రూ. 150 ఉంటే రూ. 200 పెరిగింది. అగ్గిపెట్టెల కట్ట ఒకటి రూ.15 ఉంటే రూ. 20 పలుకుతోంది. 25 షాట్లు రకం రూ.500 పలుకుతోంది. 1000 సీమ టపాసుల బాక్స్ రూ.550, 100 తాటాకు టపాయకాయల ధర గతంలో రూ.80 ఉంటే ఇప్పుడు రూ.130 పలుకుతోంది. ధరలు అధికంగా ఉన్న వినియోగదారులు కొనుగోళ్లు చేయక తప్పడంలేదు. వర్షం వల్ల తొలిరోజు అమ్మకాలు మందకొడిగా ఉన్నాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాణసంచా దుకాణాల పరిశీలన

తాళ్లరేవు: దీపావళి పండగ నేపథ్యంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను కోరంగి పోలీసులు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మండలంలో 63 దుకాణాలకు లైసెన్స్‌లను మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి విక్రయాలు చేపట్టారు. ఆయా దుకాణాలను కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ, డీటీ సూరిబాబు బృందం పరిశీలించి తగు సూచనలు చేసారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సుంకరపాలెం, నీలపల్లి, తాళ్లరేవు, జి.వేమవరంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దుకాణాల్లో నిర్ధేశించిన పరిమాణంలో మాత్రమే సామగ్రి ఉంచాలని, ఇనుప రేకులతో షెడ్లు ఏర్పాటు చేయాలని, అగ్ని ప్రమాదాల నివారణకు ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. 18 ఏళ్లు నిండినవారు మాత్రమే విక్రయాల్లో పాల్గొనాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిబంధనలు పాటించకుంటే లైసెన్సు రద్దు

కాట్రేనికోన: బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించకుంటే వారు తీసుకున్న తాత్కాలిక లైసెన్సులను రద్దు చేస్తామని కాట్రేనికోన తహసీల్దారు సుబ్బలక్ష్మి హెచ్చరించారు. జీఎస్టీ అధికారుల నుంచి అనుమతి పొందిన బాణసంచా మాత్రమే సరసమైన ధరలకు విక్రయించాలన్నారు. నిబంధనల ప్రకారం పక్కా భవనం, రేకుల షెడ్లలో బాణసంచా నిల్వ ఉంచి, ఇతరులను లోనికి అనుమతించరాదని సూచించారు. పర్యావరణహితమైన బాణసంచా మాత్రమే విక్రయించాలని అన్నారు. సేల్స్‌ట్యాక్స్ అధికారులు బాణసంచా విక్రయాలపై దృష్టి సారించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు.

ఎమ్మెల్సీ కుడుపూడి పరామర్శ


మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: చిన్నాన్న వియోగంతో బాధపడుతున్న ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పొన్నాడ వెంకటసతీష్ కుమార్, దివంగత జగన్నాథం కుమారుడు కుమార్‌ను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆదివారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ చిన్నాన్న అమలాపురానికి చెందిన పొన్నాడ జగన్నాథం ఇటీవల ఆకస్మిక మృతి చెందిన సంగతి తెలిసిందే. అమలాపురంలోని జగన్నాథం ఇంటికి ఎమ్మెల్సీ వెళ్లి ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు.

పలువురి సంతాపం

తాళ్లరేవు: మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ చిన్నాన్న జగన్నాథరావు మృతికి పలువురు ఆదివారం సంతాపం తెలియజేసారు. జగన్నాథరావు చిత్రపటం వద్ద పార్టీ జిల్లా నాయకులు అంకాడి అంజిబాబు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు రేకాడి నరసింహమూర్తి, ఆకుల వెంకటేశ్వర్లు, పెస్సింగి వీరప్రసాద్, దడాల జగదీశ్వరరావు నివాళులర్పించారు.

మాంసం విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రజలు రోగాల బారిన పడుతున్న నేపథ్యంలో మాంసం విక్రయదారులు తగిన జాగ్రత్తలు తీసుకుని వినియోగదారులకు విక్రయించాలని అంబాజీపేట పీహెచ్‌సీ సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. స్థానిక మాంసం విక్రయ షాపులను ఆదివారం ఆయన తనిఖీ చేశారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం


ప్రొఫెసర్ నాగేంద్రను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యులు అన్నారు. అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద ఆదివారం ఆరోగ్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి మాట్లాడుతూ మనిషికి రక్తపోటు (బీపీ) అత్యంత ప్రమాదకరమైనదని, బీపీ బాధితులు అప్రమత్తంగా ఉంటూ వైద్యం పొందాలని తెలిపారు. బీపీతోపాటు కిడ్నీల సమస్యలపై ఆయన వాకర్స్‌కు అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సుకు వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వాకర్స్ క్లబ్ సమావేశానికి ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రొఫెసర్ నాగేంద్రను వాకర్స్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సదస్సులో వాకర్స్ క్లబ్ కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వై.అనంతలక్ష్మి, గోటేటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి


అఖిల భారత మహాసభలో యాదవ సంఘ నాయకులు

యానాం: ఆంధ్ర రాష్ట్రంలో సుమారు 60 లక్షల మందికిపైగా ఉన్న యాదవులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించేలా వచ్చే ఎన్నికల్లో యాదవ సామాజిక వర్గానికి 25 అసెంబ్లీ, 5 ఎంపీ సీట్లు కేటాయించాలని తదితర 11 తీర్మానాలను అఖిల భారత యాదవ మహాసభ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆదివారం యానాంలో అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో పుదుచ్చేరి(యానాం), ఆంధ్రప్రదేశ్ శాఖల అఖిల భారతీయ యాదవ మహాసభ సమావేశం ఏపీ స్టేట్ అధ్యక్షుడు లాకా వెంగళరావు, పుదుచ్చేరి అధ్యక్షుడు మట్టా సురేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభలో యాదవ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, అమరావతిలో యాదవుల వసతి కోసం యాదవ భవన్ నిర్మాణం, పశువుల కాపరుల పిల్లల విద్యకు గురుకుల పాఠశాల, టీటీడీ దేవస్థానంలో యాదవులకు మఠం నిర్మాణం, పాలక మండలిలో సభ్యుడిగా నియామకం, శరభయ్య యాదవ్ విగ్రహం ఏర్పాటు, పశువుల మేపుకోవడానికి బంజర భూముల కేటాయింపు, గొర్రెలు, మేకల పెంపకందార్లు ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపు, నామినేటెడ్ పదవుల్లో ప్రాతినిధ్యం తదితర డిమాండ్లను మహాసభ తీర్మానించింది. అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శి సుర్తు నరేంద్ర యాదవ్ మాట్లాడుతూ 70 ఏళ్లుగా అడుగుతున్న 50శాతంగా ఉన్న బీసీ జనాభాకు సమానమైన రిజర్వేషన్లు ఇవ్వాలని శాస్త్రీయంగా నిర్ధారణ చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని దీనిని 9వ షెడ్యూలులో పెట్టాలని కోరారు. తెలంగాణలో స్థానిక సంస్థల్లో 46 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా నిర్ణయం జరిగిందని అది న్యాయసమీక్షలో ఉందన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా ఎమ్మెల్సీ రామారావు, రామచంద్రయాదవ్, తూర్పుగోదావరి శాఖ అధ్యక్షుడు కుండల సాయికుమార్‌యాదవ్, కోన గురవయ్య, పెనుగొండ దుర్గబాబు, మట్టా పుల్లారావు, పుట్టి ఏడుకొండలు, ఏసుబాబు, మొండి సత్యనారాయణ, వీరబాబు, గంగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం


దాత హరికట శ్రీవేద్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన హరికట శ్రీవేద్ ఆదివారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు సత్తిబాబుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

చెరువును తలపిస్తున్న రహదారి


చినగాడవిల్లిలో వర్షం నీరు చేరి అధ్వానంగా గొల్లవిల్లి- ఉప్పూడి ప్రధాన రహదారి

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి నుంచి సన్నవిల్లి మీదుగా ఉప్పూడి వరకూ 6.5 కిలోమీటర్లు విస్తరించి ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా అధ్వానంగా మారి ఇటీవల కురిసిన వర్షాలకు అడుగడుగునా గోతుల్లో నీరు చేరి చెరువును తలపిస్తోంది. ఈ రహదారి మీదుగా నాలుగు గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రం అమలాపురానికి నిత్యం వాహనదారులు ప్రయాణిస్తుంటారు. ప్రతిరోజు విద్యార్థులు ఈ మార్గం గుండా పాఠశాలలకు, కళాశాలలకు ప్రయాణిస్తుంటారు. వర్షం కురిసినప్పుడు దారంతా నీటిమయంగా మారి ప్రయాణాలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రోడ్లు మరమ్మతులు చేయాలని పాలకపక్ష నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రయాణాలకు ఆటంకం లేకుండా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెత్త సమస్యకు పరిష్కారమేదీ?

- బండారులంకలో డంపింగ్ యార్డుకు స్థలం కొరత
- పంచాయతీ స్థలంలో చెత్త వేయకుండా అడ్డుకున్న గ్రామస్తులు
- రోడ్డు, డ్రైయిన్ల వద్ద చెత్త పారబోత



బండారులంకలో రిలే దీక్షలో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యురాలు హిమభారతి, గ్రామ ప్రజలు


బండారులంకలో రోడ్డు పక్కన చెత్త కుప్పలు

అమలాపురం రూరల్: మేజర్ పంచాయతీ బండారులంకలో చెత్త సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఏడాదిగా గ్రామ పంచాయతీలోని పారిశుధ్య సిబ్బంది చెత్తను ఇళ్ల వద్ద సేకరించి ట్రాక్టర్లు తరలించడం నిలిపివేయడం గ్రామంలో ఏ వీధి చూసినా చెత్తమయంగా మారింది. అధికారులు, రాజకీయ నాయకులు చెత్త డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం చూపకపోవడంతో దోమల ఉధృతి కారణంగా రోగాలబారిన పడుతున్నామని గ్రామస్తులు అన్నారు.

ఫలించని చర్చలు

బండారులంక గ్రామ పంచాయతీలో 15వేల జనాభా ఉంది. రోజుకు ఇళ్ల వద్ద నుంచి నాలుగు ట్రాక్టర్ల చెత్త వస్తుంది. ఈ చెత్తను గ్రామంలో శివాలయం సమీపంలోని కౌన్సిక డ్రైయిన్ వద్ద పంచాయతీ స్థలంలోని డంపింగ్ యార్డుకు తరలించేవారు. ఏడాది క్రితం శివాలయం వద్ద చుట్టూ నివాసం ఉంటున్న 13 కుటుంబాలతో పాటు కొంతమంది డంపింగ్ యార్డులో చెత్త వేయడం వల్ల రోగాల బారినపడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. చెత్త తీసుకువచ్చిన ట్రాక్టర్లను మహిళలు అడ్డుకుని ఆందోళన వ్యక్తం చేయడంతో వివాదం ఏర్పడింది. పోలీసులు బలవంతంగా చెత్తను డంపింగ్‌యార్డుకు తలించారు. రెండు రోజులకే మళ్లీ మహిళలు ఆందోళన వ్యక్తం చేయడంతో పంచాయతీ సిబ్బంది చెత్తను వేయడం నిలిపివేశారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చర్చలు జరిపినా ప్రయోజనం లేకుండా పోయింది. కొంతమంది హైకోర్టును ఆశ్రయించడంతో చెత్త వేయవద్దని స్టే విధించింది. దీంతో చెత్త సమస్య జటిలమైంది. ఇళ్ల నుంచి వచ్చే తడి చెత్త - పొడి చెత్తను పంచాయతీ సిబ్బంది సేకరించి గ్రామంలో రోడ్డు పక్కన, కౌశిక డ్రెయిన్ల వద్ద వేసేవారు. అక్కడ చెత్త పేరుకుపోవడంతో నిలిపివేశారు. వేసవి కాలంలో చెత్తకు నిప్పుపెట్టి కాల్చేవారు. గ్రామంలో కాలుష్యం వ్యాపించి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని డీపీవోకు ఫిర్యాదు చేయడంతో పంచాయతీ సిబ్బంది చెత్తకు నిప్పు పెట్టకుండా నిలిపివేశారు. గ్రామంలో ఎక్కడ చెత్త అక్కడే ఉంటోంది. అమలాపురం మున్సిపల్ డంపింగ్ యార్డు వద్ద, ఇందుపల్లి వంతెన వద్ద చెత్త వేయడంతో స్థానికులు, కౌన్సిలర్లు అడ్డుకున్నారు. బండారులంకలోని వీధుల్లో, ఇళ్ల వద్ద ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొంది. గ్రామంలో విపరీతంగా దోమలు విజృంభించడంతో రోగాలు ప్రబలుతున్నాయి.

గ్రామస్తుల పోరు బాట

చెత్త సమస్యకు పరిష్కారం కోసం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బండారులంక పంచాయతీ వద్ద నాలుగు రోజులుగా గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామ ప్రజలకు అండగా నిలిచారు. వీరికి రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామితోపాటు పలు గ్రామాల ప్రజాప్రతినిధులు మద్దతు తెలుపుతున్నారు. రోజుకు ఒక వార్డు నుంచి మహిళలు, గ్రామస్తులు రిలే దీక్షలు చేస్తున్నారు. పేరుకుపోయిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే వరకు ఉద్యమం చేస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

బండారులంకలో చెత్తను తరలించాలని వైఎస్సార్ సీపీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం ఐదో రోజుకు చేరాయి. పంచాయతీ నాల్గవ వార్డు మెంబర్ అంకం వెంకటనాగసూర్య ప్రకాష రావు ఆధ్వర్యంలో దీక్షలో ఎంపీటీసీ అంకం హిమభారతి, వార్డు ప్రజలు పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ ఊటుకూరి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ గుత్తుల జానకీ లక్ష్మి, నాయకులు సరెళ్ల రామకృష్ణ, దంగేటి వెంకటశెట్టి, కారుపర్తి మల్లేశ్వరరావు, దొమ్మేటి బాబ్జి, వాసా దొరబాబు, దంగేటి ప్రసాద్, ఇనుమర్తి లింగమూర్తి, కాశిన గురులింగం, కుర్మా క్రీస్తు బాబు తదితరులు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



మేజర్ గ్రామ పంచాయతీ అయిన బండారులంకలో చెత్త సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదు. ఏడాది నుంచి చెత్త సమస్య వల్ల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– కట్టా చండీ ప్రియ, బండారులంక, అమలాపురం

శాశ్వత పరిష్కారానికి ఉద్యమం



బండారులంకలో చెత్త సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కనిపించలేదు. చేనేత రంగంలో ప్రసిద్ధి చెందిన గ్రామం నేడు మురికి కూపంగా మారింది. చెత్త సమస్యను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. సమస్య శాశ్వత పరిష్కారానికి ఉద్యమం చేపట్టాం.

– జాన జగదీష్‌చంద్ర గణేష్, బండారులంక, అమలాపురం మండలం

కల్వర్టులు నిర్మించాలి


పాత కోరంగి రోప్ వే బ్రిడ్జిని పరిశీలిస్తున్న హరీష్ మాథుర్

తాళ్లరేవు: కోరంగి–పాతకోరంగి గ్రామాల మధ్య ఉన్న రోప్ వే బ్రిడ్జిని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ ఆదివారం పంచాయతీరాజ్ అధికారులతో కలిసి పరిశీలించారు. దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి నిర్మించిన రోప్ వే బ్రిడ్జి శిథిలస్థితికి చేరుకోవడంతో గ్రామస్తుల కోరిక మేరకు ఆయన పరిశీలించారు. ఇప్పటికే ఈ బ్రిడ్జి మరమ్మతులకు రూ.20 లక్షలు మంజూరు కాగా అవి సరిపోవని, మరొక రూ.40 లక్షలు అవసరమని అధికారులు తెలిపారు. ఆయా గ్రామాల మధ్య పూర్తిస్థాయిలో వంతెన నిర్మాణానికి రూ.13 కోట్లవరకు ఖర్చవుతుందని తెలిపారు. పాతకోరంగి నుంచి పటవల వరకూ కాలువగట్టును అభివృద్ధితోపాటు రెండు కల్వర్టులు నిర్మించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు, కొప్పిశెట్టి చంటి, జవ్వాది తాతాజీ పాల్గొన్నారు.